## క్లుప్తంగా

### విద్యుత్‌కు అంతరాయం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి, అయినాపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### హరీశ్‌రావు చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని విఠలాపూర్, గంగాపూర్ గ్రామాల రైతులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సాగునీరు అందడం లేదని రైతులు ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు భూములు కోల్పోయే రైతులను ఒప్పించి శుక్రవారం కాల్వపనులు ప్రారంభించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కాల్వల నిర్మాణానికి హరీశ్‌రావు ఎంతో శ్రమించారన్నారు.

### గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: క్రీడా పోటీల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని, నిరంతరం శ్రమిస్తే గెలుపు మన తలుపుతడుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం వాజ్‌పాయ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మై భారత్ ఎన్‌వైకే సహకారంతో కబడ్డీ, వాలీబాల్, షటిల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలతో కూడా ఉన్నత స్థాయికి వెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బత్తుల శంకర్ బాబు, అనంత స్వామి, రాంప్రసాద్, రాజేందర్‌చారి, నరేశ్ ఉన్నారు.

### అపోహలు పెట్టుకోవద్దు

నంగునూరు(సిద్దిపేట): కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం డబ్బులు మంజూరు చేస్తుందని, ఏ విధమైన అపోహలూ పెట్టుకోవద్దని తహసీల్దార్ సరిత అన్నారు. నంగునూరు మండలంలోని 14 గ్రామాలకుగాను 38 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారికి విడతల వారీగా డబ్బులు మంజూరౌతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ లింగం, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటి కోసం వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని నారాయణరావుపేట మండల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి ఈఈ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది జనవరి చివరిలో నీరు విడుదల చేయడం వల్ల అన్ని గ్రామాలకు నీరు అందక పంటలు ఎండిపోయి నష్టం వాటిల్లిందన్నారు. సంక్రాంతి పండుగలోపు నుంచి నీటిని విడుదలచేసి అన్ని గ్రామాల చెరువులు, కుంటలు నింపి న్యాయం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ బాలకృష్ణ, నాయకులు ఆంజనేయులు, ఎల్లారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీడీ క్లినిక్ సేవలు

గజ్వేల్: ప్రజలు స్థానిక ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం మహిళల కోసం ఎన్‌సీడీ క్లినిక్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వైద్యులు సాయికిరణ్, మంజుల పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు ఆశాల వినతి

దుబ్బాక: తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, ఫిక్స్‌డ్ వేతనాలు ఇచ్చేలా చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన పీఏ జనార్దన్‌కు వినతిపత్రం అందించారు. ప్రవీణ, చంద్రకళ, కవిత, సుజాత తదితరులు ఉన్నారు.

### ప్రింటర్ అందజేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెలుగు ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మావతికి ప్రింటర్ అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు సురేఖ, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): శ్రీవెంకటేశ్వరుని దివ్యదర్శనం



వర్గల్(గజ్వేల్): వర్గల్ వెంకటేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు



వర్గల్(గజ్వేల్): నాచగిరిలో స్వామివారి ఊరేగింపు

## 'ముక్కోటి' వైభవం

ప్రసిద్ధమైన నాచగిరి, వర్గల్‌తో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వారం గుండా ఆయా స్వామివార్లను దర్శించుకొని తరించారు. 5వేలకుపైగా భక్తులు నాచగిరీశుని దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు. దుబ్బాక బాలాజీ స్వామిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.



దుబ్బాక బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామిజీ



మిరుదొడ్డి(దుబ్బాక): పూజలు చేస్తున్న అర్చకులు



గజ్వేల్‌రూరల్: కొడకండ్లలో...



చేర్యాల(సిద్దిపేట): వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న స్వరూపరాణి దంపతులు



మద్దూరు(హుస్నాబాద్): శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో...



సిద్దిపేటరూరల్: క్యూలైన్‌లో నిలబడ్డ భక్తులు

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

**ఏసీపీ సతీశ్**

హుస్నాబాద్/దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పోలీసు అధికారులు పలు చోట్ల ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మహేశ్ పాల్గొన్నారు. దుబ్బాక మండలం రాయపోల్ ఉన్నత పాఠశాలలో ఏఎస్‌ఐ దేవయ్య మాట్లాడారు. గజ్వేల్‌లో ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 21మంది పట్టుపడగా జడ్జి ప్రియాంక వారికి రూ.22.500 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. సిద్దిపేటలో ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మాస్టర్ మైండ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

## ప్లాస్టిక్ వ్యర్థాలను కాలిస్తే కాలుష్యం

**మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్**

దుబ్బాక: సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చొద్దని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ సూచించారు. లచ్చపేట వార్డులో నిర్మించిన డీఆర్‌సీసీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ పారిశుద్ధ్య సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌సీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తొట్టిల్లో విడివిడిగా తడి, పొడి చెత్తను వేరుచేసి వాటిద్వారా ఎరువులను తయారు చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్నారు. తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. 11వ వార్డులోని రజకవాడలో రూ.2.5లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అనిల్‌రెడ్డి, ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకులు నందాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## అన్నదాతలను విస్మరిస్తే గుణపాఠం

**కిసాన్‌మోర్చా జిల్లా నేత ఏగొండ**

గజ్వేల్‌రూరల్: అన్నదాతలను విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి ఏగొండ అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని తహసీల్దార్ కార్యాలయ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేయాలని, ఎకరాకు రూ.15వేలు రైతు భరోసా అందించాలన్నారు. అదే విధంగా వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు అందించాలని, రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్‌భీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, బాలయ్య, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ దుకాణాలు తొలగించకపోతే చర్యలు

**రెవెన్యూ, పోలీస్, జీపీ అధికారుల హెచ్చరిక**

కోహెడ(హుస్నాబాద్): కోహెడ-హుస్నాబాద్ రోడ్డు ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిలో పలువురు ఏర్పాటుచేసిన షాపులను రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేఖ మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన జాలిగం భరత్ ఫిర్యాదు మేరకు స్థలంలో అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించామన్నారు. ఇప్పుడు మళ్లీ పరిశీలించామని, ఆ షాపులను వెంటనే తొలగించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఇటీవల కొందరు స్వచ్ఛందంగా తొలగించారని, మరి కొందరు తొలగించడంలో జాప్యం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అభిలాష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

### నాణ్యత పాటించాలి

**– అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్**

సిద్దిపేటఅర్బన్: నాణ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని మండల ఏఓ బి.శ్రీనాథ్ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్, రిజిష్టర్, ధరల పట్టికను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నియ మాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పలు విద్యాలయాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. సిద్దిపేట ఇంద్రానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పాల్గొన్నారు. విద్యార్థులు వివేకానందుడు చూపిన మార్గంలో పయనించాలన్నారు. నగర కార్యదర్శి పరశురాం, జోనల్ ఇన్‌చార్జి అనీష్, లోకేశ్, పవన్ పాల్గొన్నారు.

**రక్తదాన శిబిరం**

గజ్వేల్: స్థానిక ప్రగతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవంలో సీఐ సైదా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ అంబదాస్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ భవాని, చర్మవ్యాధి నిపుణులు సునీత్‌కుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత స్థానంలో నిలిచినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జూనియర్ కళాశాలల ఉమ్మడి మెదక్ జిల్లా పర్యవేక్షణాధికారి కిషన్ అన్నారు. డీఐఈఓ రవీందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం డీఐఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధంచేసి, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యవేక్షణాధికారి కిషన్

### రమ్యంగా రంగవల్లులు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, వివిధ గ్రామాలు, మండల కేంద్రాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు వేసి ప్రతిభ చూపారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): ముగ్గులను పరిశీలిస్తున్న లింగమూర్తి తదితరులు





సిద్దిపేట: సెలెస్టియల్ స్కూల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

## ముందస్తు సంక్రాంతి

జిల్లాలో ముందస్తు సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. శనివారం నుంచి సెలవులు ఇస్తున్న సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలల్లో పండుగ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటాలతో పల్లెటూరు వాతావరణం తలపించేలా అలరించారు. రంగురంగుల ముగ్గులు వేశారు. భోగిమంటలు వేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. హరిదాసు, సోదిచెప్పే వారి వేషధారణలతో అలరించారు. గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.



హుస్నాబాద్: భోగిమంటల చుట్టూ కోలాటం ఆడుతున్న విద్యార్థినులు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



మద్దూరు(హుస్నాబాద్): కస్తూర్బా పాఠశాలలో..



దుబ్బాక: ధర్మాజీపేట పాఠశాలలో విద్యార్థుల ముగ్గుల ప్రదర్శన



సిద్దిపేటఅర్బన్: ఇన్‌టోన్ నెట్‌వర్క్ కంపెనీ ఉద్యోగుల సంబురాలు

## సంక్షిప్త వార్తలు

◆ **ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు చోరీ**

గజ్వేల్‌రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్ చోరీచేసిన ఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గురువారం రాత్రి కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. దాని విలువ రూ.20వేలు ఉంటుందని విద్యుత్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ **త్వరితగతిన స్థలాల క్రమబద్ధీకరణ**

సిద్దిపేటజోన్: స్థలాల క్రమబద్ధీకరణను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎల్టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు, సిబ్బంది పనులు పూర్తిచేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా వచ్చిన దరఖాస్తులను మార్చి31లోగా పూర్తి చేయాలని చెప్పారు.

◆ **రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా రేష్మ**

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యాదర్శిగా మండలంలోని గౌరయపల్లికి చెందిన మహమ్మద్ రేష్మను నియమించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మహిళ అధ్యక్షురాలు సునీతా రావు ఆమెకు నియామకపత్రం అందించారు.

◆ **చిన్నారులకు చేయూత**

గజ్వేల్‌రూరల్: తల్లి మృతిచెందడంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు చిన్నారులకు ఎస్ఆర్ ఫౌండేషన్ చేయూతనందించింది. మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన మాస్టి నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆమె ముగ్గురు కొడుకులు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ అధ్యక్షురాలు మహ్మద్ సుల్తానాఉమర్ శుక్రవారం వారిని పరామర్శించి నిత్యావసర సరుకులు, దుస్తులు, ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు రాజు, ఉమర్, గణేశ్, నర్సింలు, బాలేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **క్యాలెండర్‌ను ఆవిష్కరించిన నర్సారెడ్డి**

గజ్వేల్: మేరు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పథకాలను సద్వినియోగం చేసుకోండి**

సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సూచించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు శుక్రవారం విపంచి ఆడిటోరియంలో సిద్దిపేట అర్బన్, రూరల్ పరిధిలోని 212 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు కవిత, రేణుక, లక్ష్మణ్, శోభ, సురేశ్, విఠోభ, దీప్తి, మోహిజ్, ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

◆ **బాధ్యతగా వ్యవహరిస్తేనే గుర్తింపు**

మిరుదొడ్డి(దుబ్బాక): విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే మంచి గుర్తింపు వస్తుందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక సంబురాలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులను శుక్రవారం ఆయన సత్కరించారు. ఎంఈఓ అంజయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉచిత పశువైద్య శిబిరం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): పశు ఆరోగ్య చికిత్సల కోసం ఏర్పాటుచేస్తున్న శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ కొండల్ రెడ్డి సూచించారు. అలిరాజ్‌పేటలో శుక్రవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు పశువులకు ముందస్తు టీకాలను వేయించాలన్నారు. విజయ డెయిరీ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, వీఏ శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, యాదగిరి, స్వామి, గౌరయ్య, ఖాన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

◆ **పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

దుబ్బాకటౌన్: విద్యార్థులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. లచ్చపేట మోడల్ స్కూల్లో శుక్రవారం ఫుడ్, కైట్ ఫెస్టివల్, రంగోళి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన వంటకాలను ఆయన రుచి చూశారు. ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయ వృత్తి కీలకమైంది**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని, ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీవాణి పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.